క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

మల్యాల: 33/11 కేవీ రాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని రాంపూర్, ఒబులాపూర్, ఒడ్డెరకాల నీలకు నూతన బ్రేకర్ పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు రామన్నపేట విద్యుత్ ఏఈ ఆకునూరి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉండదన్నారు.

నేడు పెగడపల్లికి మంత్రి అడ్లూరి

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శుక్రవారం పర్యటిస్తారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్ గురువారం తెలిపారు. మండలంలోని లింగాపూర్, అయితిపల్లి గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని, ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని వివరించారు.

ఆలయాభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అధ్యక్షుడు మచ్చ శ్రీధర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి మహేందర్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి అశోక్ తదితరులున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కార్యదర్శి ఆదేశాల మేరకు గురువారం హెల్ప్ కార్యక్రమంలో భాగంగా నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వేణు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కళాశాల స్టూడెంట్స్ కౌన్సిలర్ డాక్టర్ పి.తిరుపతి అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, నాయకులు

ఇబ్రహీంపట్నం: తహసీల్ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తున్న రమేశ్ ఈనెల 15న ఉత్తమ ఆర్ఐగా అవార్డు అందుకున్నారు. గురువారం కార్యాలయంలో తహసీల్దార్ వరప్రసాద్, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్, మాజీ జెడ్పీటీసీ కోక్కు పురుషోత్తం, రాంరెడ్డి సన్మానించి అభినందించారు.



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మేడిపల్లి: ఇటీవల అమెరికా టోలాసో యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న వెంకట్రావుపేట మాజీ సర్పంచ్, జీర్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్‌కుమార్‌ను జగిత్యాల లయన్స్ క్లబ్ సభ్యులు గురువారం సన్మానించారు. వడ్డగట్ల శంకర్, గుండేటి గంగాధర్, సామాన్ల శ్రీహరి తదితరులున్నారు.

బ్రిడ్జి పనులు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ఎంపీడీవో ఎండీ సలీమ్ ఆర్అండ్‌బీ ఏఈ ఫైజన్‌ను ఆదేశించారు. గురువారం యామాపూర్, ఫకీర్‌కొండాపూర్ మధ్య ఆగిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణంతో పక్కనే తాత్కాలిక రోడ్డు వేయగా.. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పనుల జాతరపై మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. పీఆర్ ఏఈ అభినవ్, ఏపీవో కొమరయ్య, టీఏలు గంగాధర్, వినోద్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌కు పదోన్నతి



జగిత్యాలక్రైం: పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్సైగా పదోన్నతి పొందిన రాజశ్రీ గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ ఆమెకు పదోన్నతి స్టార్‌ను అందజేశారు.

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం



రాఘవపేట శివారులో రోడ్డు పక్కన పడేస్తున్న చెత్తాచెదారం



నడికుడ శివారులో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు

- గ్రామాల్లో వృథాగా సెగ్రిగేషన్ షెడ్లు
- నామమాత్రంగా తడి, పొడి చెత్త సేకరణ
- నిర్వహణ లోపంతో నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని అధికారులు

మల్లాపూర్: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్ది, ఇళ్లలో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ కోసం ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. పారిశుధ్య కార్మికులకు చెత్త సేకరణపై అవగాహన లేకపోవడంతో చెత్తను గ్రామాల శివారు ప్రాంతాల్లోకి తీసుకెళ్లి పడేసి దహనం చేస్తున్నారు. దీంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతోంది. ఎరువుల తయారీతో ఆదాయం పొందడం దేవుడెరుగు.. కొన్ని పంచాయతీలు వీటి నిర్వహణను గాలికొదిలేశాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

నిధులు వృథా..

మండలంలోని 23 పంచాయతీల్లో గత ప్రభుత్వంలో ఉపాధిహామీ, స్వచ్ఛభారత్ నిధులతో డంపింగ్, వర్మి కంపోస్టు షెడ్లను నిర్మించారు. ఉపాధిహామీ నిధులతో కొన్ని గ్రామాల్లో టైప్-1 షెడ్లకు రూ.1-2 లక్షలు, టైప్-2 షెడ్ల నిర్మాణాలకు రూ.2-5 లక్షలు ఖర్చు చేశారు. వీటిని డంపింగ్ యార్డులు వర్మి కంపోస్టు ఎరువు తయారీకి వినియోగించేలా నిర్మించారు.

నిర్వహణ ఇలా..

- గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. సేకరించిన చెత్తలో నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేసి మిగిలిన దానిని సమీపంలో నిర్మించిన వర్మి కంపోస్టు షెడ్‌లో వేయాలి.
- కంపోస్ట్ షెడ్‌లో చెత్త ద్వారా తయారైన సేంద్రియ ఎరువులను గ్రామాలు, రోడ్ల పక్కన నాటిన మొక్కలకు ఎరువుగా వేయాలి.
- మిగిలిన ఎరువులను గ్రామ రైతులకు విక్రయించి వచ్చిన సొమ్మును గ్రామ పంచాయతీలో జమ చేయాలి. దీంతోపాటు ప్లాస్టిక్‌ను సైతం విక్రయించి జీపీలో జమ చేయాలి.
- గ్రామస్తులకు తడి, పొడి చెత్తపై ఎప్పటికప్పుడూ అవగాహన కల్పించాలి.

జరుగుతున్నదిలా..

- మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో కొన్ని జీపీలు మినహాయిస్తే చాలావరకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు.
- సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులు, కంపోస్టు యార్డుల్లో నామమాత్రంగానే వేసి, అధిక భాగం గ్రామ సమీపంలోని ఖాళీ ప్రదేశాలు, చెరువులు, కుంటలు, వాగులు, వంకలు, పోరంబోకు స్థలాల్లో వేసి తగులబెడుతున్నారు.
- చెత్త సేకరణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలిసిన అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో కొంతమంది కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఎందుకిలా..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అప్పట్లో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. మొదట్లో కొన్నిరోజుల పాటు గ్రామాల ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి ఇచ్చారు. కానీ కొన్ని రోజుల తర్వాత ప్రజలు మొత్తం ఒకే దగ్గర వేసి అందించడం.. గ్రామ పంచాయతీ కార్మికులు సైతం ఆ విధంగానే తీసుకోవడం ప్రారంభించారు. ఈ చెత్తను వేరు చేయడం చాల శ్రమతో కూడుకున్నది కావడం, దీనికి తోడు కార్మికులకు గ్రామంలో అనేక పనులు ఉండటంతో అటు పంచాయతీ కార్యదర్శులు, ఇటు సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

అధికారులు ఏం చేస్తున్నట్లు..?

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన అధికారులు తడి, పొడి చెత్తపై అంతగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల పనితీరును నిత్యం పర్యవేక్షించాలి.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో నిత్యం సేకరించిన చెత్తాచెదారాలతో డంపింగ్ యార్డులు నిండిపోతున్నాయి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సుమారు 50 శాతం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఈ సమస్యను అధిగమించేందుకు టైప్-1 కంపోస్టు షెడ్ల పరిమితిని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– శశికుమార్‌రెడ్డి, ఎంపీడీవో, మల్లాపూర్



పెగడపల్లి: నామాపూర్ పంపు హౌస్ వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారిపోయింది. కాంట్రాక్టు పనులు పొందిన మేఘా కంపెనీ చేపట్టిన పంపు హౌస్ నిర్మాణ పనుల సమయంలో ఈ రహదారిని ధ్వంసం చేసి పైపులైన్ వేశారు. పనులు పూర్తయిన తరువాత మట్టితో నింపి వదిలేసిన రోడ్డుకు తారు వేయడం మరిచారు. దీంతో చిన్నచిన్న వర్షాలకే రోడ్డు గుంతలమయమవుతోంది. గుంతల్లో నిలుస్తున్న నీటి నిల్వలతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టర్ రోడ్డుపై తారు వేయడంలో తాత్సారం చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్, ఆర్అండ్‌బీ ఈఈ, సెల్ నంబర్: 9440818090



వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రకటన బోర్డులు తొలగింపు



సాక్షి స్పందన

కోరుట్ల రూరల్: కోరుట్ల బస్టాండ్‌లో ఓ షాపింగ్ మాల్‌కు సంబంధించిన ప్రకటన బోర్డులు తక్కువ ఎత్తులో బిగించడంతో ప్రయాణికుల తలలకు తగులుతున్నాయి. ఈ విషయమై సాక్షిలో ప్రచురితమవగా.. డిపో మేనేజర్ స్పందించారు. బోర్డులను తొలగించారు.

బోధనోపకరణాలతో విద్యార్థులకు మేలు



టీఎల్ఎం పరిశీలిస్తున్న అధికారులు

బుగ్గారం: వివిధ సబ్జెక్టులకు సంబంధించిన బోధనోపకరణాలు తయారు చేసి విద్యార్థులకు పాఠాలను బోధిస్తే సులువుగా అభ్యసించడానికి వీలవుతుందని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన టీఎల్ఎం మేళాను తహసీల్దార్ తిరుపతి, ఎంపీడీవో అఫ్జల్ మియా, స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. మండలంలోని ఉపాధ్యాయులు వారివారి సబ్జెక్టులకు సంబంధించి తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్‌రావు, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, సీఆర్‌పీ పురుషోత్తం, సిబ్బంది రాజేశ్, హరిత, సమత తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎస్సై నవీన్‌కుమార్

కథలాపూర్: వినాయక మండపాల నిర్వాహకులు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు పాటించాలని ఎస్సై నవీన్‌కుమార్ సూచించారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో అన్ని గ్రామాల వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్ పాల్గొన్నారు.

జగిత్యాలక్రైం: వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. జగిత్యాల పట్టణంలో గణేశ్ మండప నిర్వాహకులు 9 రోజులపాటు జరుపుకునే నవరాత్రి ఉత్సవాలపై శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవిశ్రీ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగిత్యాల: మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలని, పర్యావరణం దెబ్బతినదని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థినులు మట్టి వినాయకులను తయారు చేశారు. ప్రమోద్‌కుమార్, చంద్రయ్య, వాసవి, రహీం, నీరజ, సునీత, జ్యోత్స్న పాల్గొన్నారు.

మల్లాపూర్: ప్రజలు శాంతియుతంగా వినాయక నవరాత్రుల ఉత్సవాలను నిర్వహించుకోవాలని తహసీల్దార్ రమేశ్‌గౌడ్, ఎస్సై రాజు అన్నారు. గురువారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన గణేశ్ మండపాల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ వినీత్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీడీవో శంకర్

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో కొత్తగా రూ.1.72కోట్ల నిధులు మంజూరైనట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 19 గ్రామాల్లో 111 అభివృద్ధి పనులు చేపడతామన్నారు. శుక్రవారం ప్రారంభించాలని అన్నారు. కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పనుల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎంపీవో రాజశేఖర్, టీఏలు శ్రీధర్, అంబాజీ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలో చేపట్టనున్న పనుల జాతర-2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హౌసింగ్ పీడీ ప్రసాద్, తహసీల్దార్ రవీందర్, ఏఈలు శంషేర్ అలీ, శ్రీమాన్, ఏపీవో అనిల్ పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఉపాధి జాతర నిర్వహించాలని ఎంపీడీవో ఓదెల రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025 సంవత్సరంలో మంజూరైన పనుల వివరాలతో పనుల జాతర నిర్వహించాలన్నారు. ఏపీవో మమత, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సారంగాపూర్: ఉపాధిహామీ పథకం పనుల జాతరను గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు సారంగాపూర్, బీర్‌పూర్ ఎంపీడీవోలు గంగాధర్, భీమేశ్ పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాల్లో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

చింతకుంటలో సర్వే



హద్దుల విషయమై చర్చిస్తున్న అధికారులు

కథలాపూర్: చింతకుంట గ్రామ శివారులో అటవీ, రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు భూముల హద్దుల విషయమై గురువారం సర్వే చేపట్టారు. గ్రామ శివారులో అటవీ శాఖకు చెందిన భూమి ఎంత, రెవెన్యూ శాఖ భూమి ఎంత అనే విషయంలో ఇరు శాఖల అధికారులు రికార్డుల ప్రకారం కొలతలు పెట్టారు. వివాదాలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. మెట్‌పల్లి ఎఫ్ఆర్‌వో పద్మారావు, ఆర్ఐ నాగేశ్, సెక్షన్ ఆఫీసర్ ముస్తాక్ అలీ, బీట్ ఆఫీసర్ సాయిరాం పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

సారంగాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయొద్దని డీఎల్‌పీవో వాసవి అన్నారు. గురువారం భీంరెడ్డిగూడెం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు మురికికాలువలను శుభ్రం చేయించాలని, బావుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో సురేశ్‌రెడ్డి, కార్యదర్శి జల, సిబ్బంది ఉన్నారు.

రాజారాంపల్లి వాసికి డాక్టరేట్

వెల్గటూర్: ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామానికి చెందిన బండ నరేశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పొందారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎన్‌సీసీ కమాండర్

జగిత్యాల: యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. గురువారం ఎన్‌సీసీ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సూచనలిచ్చారు. ప్రతీ విద్యార్థిలో దేశభక్తి ఉండాలని, దేశం కోసం కృషి చేయాలన్నారు. ఆర్మీ అధికారి హవల్దార్ రాకేశ్ మాట్లాడుతూ.. క్రమశిక్షణతో ఏకత్వం, జాతీయ భావన, దేశ భావన పెంపొందుతుందన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ అధికారి రాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మధుకర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంపై దాడిని ఖండిస్తున్నాం

జగిత్యాల: ఢిల్లీలో సీఎం రేఖా గుప్తాపై ఆగంతకుడి దాడిని ఖండిస్తున్నామని భారత సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని అస్థిరపర్చడానికే ఇలా చేస్తున్నారని, ఒక సీఎంపై ఆగంతకుడు దాడి చేస్తే మతిస్థిమితం లేని కారణంగా దాడి చేశారని ప్రతిపక్షాలు వెనకేసుకొస్తున్నాయని ఆరోపించారు. కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యదర్శి కాశీనాథం, చిట్ల గంగాధర్, వెంకట్‌రెడ్డి, దేవరాజం పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేపట్టిన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీవో స్వరూపరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, ఎస్సై సందీప్, ఎలెటి మమత-నరసింహారెడ్డి హాజరయ్యారు. ఉపాధ్యాయులు, బండ నరసింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, బోగ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు, డీజే నిర్వాహకుల బైండోవర్

జగిత్యాలక్రైం: గణేశ్ నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని పలువురిని తహసీల్దార్ రాంమోహన్ ముందు గురువారం బైండోవర్ చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. 10 మంది డీజే నిర్వాహకులు, ఏడుగురు రౌడీషీటర్లు, 10 మంది సమస్యలు ఉత్పన్నం చేసే వారిని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గణేశ్‌నగర్‌లో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న స్థావరంపై పట్టణ ఎస్సై సుప్రియ దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.13,460 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జేఎన్టీయూలో 'ర్యాంప్' సదస్సు

కొడిమ్యాల: నాచుపల్లి జేఎన్టీయూలో వైస్‌చాన్సలర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రైసింగ్ అండ్ ఎక్సలరేటింగ్ ఎస్ఎంఈ పర్ఫామెన్స్(ర్యాంప్) అవగాహన సదస్సు నిర్వహించారు. 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి 15 రోజులపాటు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం, ప్రభుత్వ ఫండింగ్ స్కీములు, నైపుణ్య అభివద్ధిపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 10 బృందాలు అంకుర, నూతన ఆలోచనలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ ఎస్.విశ్వనాథరాజు, అలీఫ్ డైరెక్టర్ కన్నెగంటి రమాదేవి, చీఫ్ ఇన్నోవేషన్ అధికారి జహీరుల్లా, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్..

కొడిమ్యాల: నాచుపల్లి జేఎన్టీయూలో గురువారం మేధా సర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టింది. ఇందులో భాగంగా నిర్వహించిన రాత పరీక్షలో 73 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.విశ్వనాథరాజు, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

కోమటికొండాపూర్‌కు బస్సు నడిపించాలి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళా సంఘ సభ్యులు

ఇబ్రహీంపట్నం: మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మెట్‌పల్లి నుంచి ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం మీదుగా కోమటికొండాపూర్‌కు నడిపించాలని కోరుతూ గురువారం డిపో మేనేజర్ దేవరాజ్‌కు కొమటికొండాపూర్ యోగేశ్వర గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు బక్కురి రాధిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి ఎడ్ల లక్ష్మి, కోశాధికారి బన్న ప్రియంక, రెడ్డవేన లావణ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నానో యూరియాతో మొక్కకు 85 శాతం నత్రజని



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి

సారంగాపూర్: నానో యూరియా వాడకంతో మొక్క 85 శాతం వరకు నత్రజని వినియోగించుకుంటుందని మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌రెడ్డి అన్నారు. గురువారం రేచపల్లి గ్రామంలో రైతులకు నానో యూరియా వాడకంపై క్షేత్ర ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. రైతులతో మాట్లాడుతూ.. బస్తాల్లోని యూరియా పొలంలో వెదజల్లితే మొక్కకు 30 నుంచి 40 శాతం నత్రజని అందుతుందని తెలిపారు. నానో యూరియాను పిచికారీ చేస్తే వరి పొలంలోని పిలకలు 80 నుంచి 85 శాతం వరకు నత్రజనిని మొక్క తీసుకుంటుందన్నారు. రైతుల పొలాల్లో నానో యూరియా పిచికారీ చేసి చూపించారు. వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు త్వరితగతిన నిర్మించుకోవాలి



లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు

మల్లాపూర్: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టేలా అన్ని విధాలుగా అధికారులు ప్రోత్సహించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత అన్నారు. గుండంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు మొదటి విడత బిల్లు రూ.లక్ష ఖాతాల్లో జమ చేసిన లబ్ధిదారులను గురువారం అధికారులు, నాయకులతో కలిశారు. నిర్మాణ పనులను పరిశీలించి ప్రగతి వివరాలడిగి తెలుసుకున్నారు. మాజీ సర్పంచులు మామిడి లక్ష్మారెడ్డి, భూపెల్లి దేవయ్య, పంచాయతీ కార్యదర్శి నోముల నారాయణరెడ్డి, నాయకుడు అంతడుపుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వివాదంపై దృష్టి సారించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వివరిస్తున్న నాయకులు

మెట్‌పల్లి రూరల్: ఆత్మకూర్ పెద్ద వాగు నుంచి ఇసుక తరలింపు విషయంలో జరుగుతున్న వివాదం విషయంపై దృష్టి సారించాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలు గురువారం అడిషనల్ కలెక్టర్ బీఎస్ లతను కలిసి లేఖ అందజేశారు. ఇసుక విషయంలో జరుగుతున్న వివాదం గురించి వివరించారు. పెద్ద వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టడంపై గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్నాయని చెప్పారు. మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు అంజయ్య, రాజారెడ్డి, రాజు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అశోక్

జగిత్యాల: ఫిజియోథెరపీ జిల్లా కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వొల్లాల అశోక్ కుమార్, ఉపాధ్యక్షుడిగా గుండ్ల లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ అజారోద్దీన్, కోశాధికారిగా యాకూబ్, గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా గంగాధర్, ఉమ్మడి కార్యదర్శిగా హరీశ్ ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

సహాయ కార్యదర్శిగా మల్లికార్జున్

కోరుట్ల: పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఆకుల మల్లికార్జున్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు.

రాయికల్: టొలాస మెక్సికో అమెరికా యూనివర్సిటీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అవార్డు కోఆర్డినేటర్‌గా కాయితి శంకర్‌ను నియమిస్తున్నట్లు డైరెక్టర్ కట్ట బ్రహ్మణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.